
# పదునెక్కిన పేగు

డా. ఎన్.శైలజ



గంధంరంగు బెంగాల్ కాటన్ చీర కొంగు కప్పుకొని నడిచివస్తోంది కమలమ్మ. దగ్గర దగ్గర నలభై ఏళ్ళుండొచ్చేమో! కాస్త కొత్తగా యిబ్బందిపడుతూ వచ్చింది. తలెత్తి చూసిన స్టేషన్ మాస్టర్ రావు గబుక్కున లేవబోయి, నిలదొక్కుకుని కుర్చీలోనే సర్దుకుని కూర్చున్నాడు. కొద్దినిమిషాలు యిద్దరి మధ్యా నిశ్శబ్దం పేరుకుంది.

'ఈవేళ ఉద్యోగంలో చేరానండీ' అంది ఆమె.

అవును- ఆమెను స్టేషన్ స్వీపర్ ఉద్యోగంలో నియమించినట్లు వచ్చిన ఆర్డర్స్ తనే వాళ్ళింటికి పంపాడు.

అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

'అమ్మా! మీరు ఎవరి మాట వినకుండా యీ వయసులో యీ ఉద్యోగంలో చేరారు. పెద్దయింట్లో బతికి యిలా చిన్న జాబ్ చెయ్యడం కష్టం. మీరు కాస్త ఫైళ్ళు తీసుకెళ్ళడం లాంటి పనులు చెయ్యండి. స్వీపింగు పని మీరు చేస్తానన్నా మేం చేయించుకోం. ఎవర్నైనా కూలికి పెట్టి చేయిస్తాను' అన్నాడు రావు.

ఖాళీ సమయంలో లేడీస్ వెయిటింగ్ రూములో కూర్చోండి అని చెప్పాడు.

ఆమె తలూపింది.

వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్న ఆమె అర్ధంకాని ప్రశ్నలా అనిపించిందతనికి. ఆమె భర్త ప్రకాశం టిటియిగా పనిచేసేవాడు. యీ మధ్యనే ట్రైన్‌లో డ్యూటీలో ఉండగా ప్రమాదవశాత్తూ జారిపడి చనిపోయాడు.




కొడుకులు యిద్దర్లోనూ- ఒకడు బికామ్ చేశాడు. యింకోడు బిఎ పూర్తిచేయడానికి కుస్తీ పడుతున్నాడు. తండ్రి డ్యూటీలో పోవడం వలన కాంపెన్‌సేటరీ గ్రౌండ్స్ మీద పెద్ద కుర్రాడికి ఏ క్లర్క్ ఉద్యోగమో వస్తుంది అనుకున్నారంతా. తీరా ఆర్డర్స్ ప్రకాశంగారి భార్యను స్వీపర్‌గా నియమించినట్లు వచ్చాయి.

'యీ వయసులో యిల్లు వదిలి ఉద్యోగం చెయ్యడం ఎంత కష్టం' అని అందరూ ఆమెకు సలహా యిచ్చారు. విజయవాడ వెళ్ళి పెద్ద అధికారిని కలిస్తే ఆర్డరు మార్చి పిల్లలిద్దర్లో ఎవరికైనా ఉద్యోగం యిస్తారని సలహాలు కూడా చెప్పారు. ఆమె అన్నిటికీ ఉదాసీనంగా నవ్వి ఊరుకుంది. ఆరోజు స్టేషన్లో పనిచేసే అందరి చూపులూ జాలిగానో, ఆశ్చర్యంగానో, విచారంగానో ఆమె వెనకే నడుస్తున్నాయి.

మొదటిరోజు ఉద్యోగం, ఆ అనుభూతి చాలా విచిత్రంగా అర్ధంకాకుండా ఉంది. అందరి కళ్ళూ తన వెనకే ఉన్నట్లు కమలమ్మకు తెలుస్తూనే ఉంది. స్టేషన్ వెయిటింగ్ రూమ్‌లో కుర్చీలో కూర్చొంది. ఎన్నిసార్లు తను యీ రూమ్‌లో యిలా కూర్చోలేదూ! అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా. అప్పుడు భర్తతో ఊరుకెళ్తూ వచ్చికూర్చుంటే- వాళ్ళూ వీళ్ళూ వచ్చి నమస్కారాలు పెట్టడం, కాఫీలు పట్టుకొచ్చి యివ్వడం. ఎంత మర్యాద!

ప్రకాశం రైల్వేశాఖలో సీనియర్ ఉద్యోగి. మంచివాడు, మెతకమనిషని అందరూ గౌరవించేవారు.

ఆ మెతకతనం యింతై వటుడింతై అని ఆమె బతుకుని ముంచుతుందని అనుకోలేదు. చిన్నప్పుడే పెళ్ళయిందేమో- యిల్లు, తన పని, టైముకి అన్నీ అమర్చడమే. కానీ ఏనాడూ పెద్ద ఆలోచనలు చేసిన మనిషి కాదు కమలమ్మ.

ఉద్యోగంలో చేరింతర్వాత స్టేషన్లో తనని వెంటాడుతున్న చూపుల్లో ప్రశ్నలేమిటో ఆమెకు తెలుస్తూనే వున్నాయి. ఆ ప్రశ్నలకు సమాధానమూ ఆమెకే తెలుసు!

*** *** ***

ఆమెకు ఆ రోజు జరిగిందంతా మనసులో సినిమా రీలులా తిరుగుతూనే ఉంది. ప్రకాశం పొద్దున్నే డ్యూటీకి బయల్దేరుతున్నాడు. ఆ రాత్రంతా అతను మాట్లాడుతూనే ఉన్నాడు. యీ మధ్యకాలంలో అతను అంతగా ఎప్పుడూ మాట్లాడలేదు.

పెద్దోడు పుట్టినప్పుడు తను ఎంత గర్వపడ్డాడో- 'వంశం నిలబెట్టడానికి కొడుకు పుట్టాడని'. పెద్ద ఫంక్షన్ చేసి 'రాజ్‌కుమార్' అని పేరు పెట్టాడు. రెండోవాడు పుట్టినప్పుడు అంతే హడావుడి. వాళ్ళకు అందరికన్నా మంచి డ్రెస్‌లు వెయ్యాలని ఎటు కేంప్ వెళితే అక్కడి నుంచి బట్టలు తెచ్చేవాడు. వాళ్ళ చదువుల కోసం అంతే తాపత్రయం. పెద్దవాడు బికామ్ పూర్తి చేసాక ఉద్యోగం వేటలో పడ్డాడు.

'ప్రతిదీ నాన్నే చెయ్యాలి' అన్నట్టు వ్యవహరించేవాడు రాజ్‌కుమార్. అప్లికేషన్లు తేవడం, నింపడం, పంపడం- అన్నీ ఆయనే. వాడి ఉద్యోగం కోసం ఎంతమందిని ప్రయత్నించాడో ప్రకాశానికి, తనకే తెలుసు. పిల్లలు పెద్దోళ్ళయ్యాకా వాళ్ళ కోరికలు, డిమాండ్స్ పెరిగిపోయాయి. ఎంతసేపు క్వార్టర్స్‌లో మిగిలిన వాళ్ళతో పోల్చుకొనేవాళ్ళు.

'తమలాంటి పిల్లలు స్కూటర్లు నడుపుతున్నారని, యమహా మోటారు సైకిళ్ళు నడుపుతున్నారని, మాకు లేవని' వాళ్ళ బాధ. కొంతమందిలా తను అందరి దగ్గరా చెయ్యిచాచి డబ్బులు సంపాదించలేనని ప్రకాశం అనేవాడు. తన ఉద్యోగం తను చేసుకుపోవడమే గానీ మతలబులు చేయడం, రిజర్వేషన్లు యిచ్చి డబ్బులు జేబులో వేసుకోవడం అతనికి చేతకాలేదు.

ఆరునెల్ల క్రితం రాజ్‌కుమార్ విజయవాడ వెళ్ళొచ్చి యింట్లో తండ్రితో గొడవ పెట్టుకొన్నాడు. ఎదిగొచ్చిన పిల్లలు తల్లిదండ్రుల్ని ఆదరిస్తారన్న ఆశ మిగలకుండా వాడలా ఆయనతో గొడవ పడ్తుంటే ఆమె ఏమీ అనలేక మౌనంగా ఉండిపోయింది. విజయవాడ ఆఫీసులో ఎంక్వైరీ చేస్తే ఎవరో సలహా యిచ్చారట వాడికి- 'మీ నాన్న అనారోగ్య కారణాలు చూపి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంటే నీకు ఉద్యోగం వస్తుందని'.

'మీరు ఉద్యోగం చేసి మమ్మల్ని ఉద్ధరించింది చాలు! రిటైర్మెంట్ తీసుకోండని' గోల. దానికి చిన్నోడు వత్తాసు.

'అవును, ఆ ఐదేళ్ళ సర్వీసు అన్నయ్య చేస్తే నాలుగు డబ్బులన్నా పై సంపాదన తెస్తాడు. మీరే ఉద్యోగం చేస్తే ఆ జీతం తప్ప యింకేమీ యింటికి చేరదని' కొత్త వాదన.

'రిటైర్మెంట్‌లో వచ్చే డబ్బుతో నేను వ్యాపారం చేస్తాను. ఒక్క దెబ్బకి యిద్దరమూ సెటిలైపోతామని' వాళ్ళు చెబుతుంటే ప్రకాశం ఏమీ మాట్లాడలేకపోయాడు. ఆ సంఘటన అతన్ని బాగా కుంగదీసింది. పరీక్షలకు చదవమని, ఉద్యోగాలు స్వయంగా సంపాదించుకోమని అతను చెప్పిన మాటలు వాళ్ళకు రుచించలేదు.

'పక్కవాళ్ళకున్న మోటారు సైకిళ్ళు, ఖరీదైన బట్టలతో పోల్చుకుంటున్నప్పుడు- బాగా చదివి, పోటీపరీక్షల కోసం సిద్ధమౌతున్న తోటి వయసు పిల్లలతో తమను పోల్చుకోరేం! అలా కష్టపడాలను కోరేం' అంటాడు ప్రకాశం.

ప్రకాశాన్ని సమాధానపరచడానికి ప్రయత్నించేది కమలమ్మ.

'పోనీ. వాళ్ళు తప్ప మనకెవరున్నారు. మన ప్రాప్తం అంతే అనుకోండి. ఏదో మార్గం చూడండి' అని చెప్పేది ఆమె.

అడపాదడపా గొడవలు మామూలైపోయాయి యింట్లో. యింటి కొచ్చి పిల్లల ఎదుట పడాలన్నా కష్టమైపోతోంది ప్రకాశానికి. ఓ రోజు దీపావళి పండగ ముందు లైన్లోకెళ్ళి వచ్చాడు ప్రకాశం. పెద్దవాడు పక్క రూములో ఉన్నాడు. వాడు వినేలా కమలమ్మతో అన్నాడు.

'బంగారంలాంటి అవకాశాన్ని పోగొట్టారు. యీ వయసులో రిటైర్మెంట్ తీసుకుంటే మాకూ ఓ దారుండేది. ఆయనకూ రెష్టు దొరికేది. నేను చెప్పినప్పుడే ఆఫీసులో అప్లికేషను యిచ్చుంటే యీపాటికి నాకు ఉద్యోగం వచ్చేసుండేది. యింకిప్పుడు యింకో మార్గమే లేకుండాపోయింది' అని విసుక్కున్నాడు పెద్దాడు

'యీవాళ్ళ ఆఫీసులో కనుక్కొన్నాను. అలా అనారోగ్య కారణాలతో రిటైర్మెంటుకి పెట్టుకోవచ్చుట. కానీ రిటైర్మెంట్‌కి కనీసం ఐదు సంవత్సరాలు ముందు పెట్టుకోవాలట. తీరా లెక్క తీసి చూస్తే నా రిటైర్మెంట్ ఐదు సంవత్సరాలకన్నా నాలుగు నెలలు తక్కువ పడింది. నేను రిటైర్మెంట్ కోసం పెట్టినా వాడికి ఉద్యోగం రాదు. ఆ విషయం ఆయనగారికి చెప్పి ఆ బ్యాంక్ పరీక్షలకి చదవమను' అని చెప్పి వెళ్ళిపోయాడు.

ప్రకాశం వెనకాలే ధుమధుమలాడుతూ పెద్దాడూ వెళ్ళిపోయాడు. రెండు రోజులు యింటికి రాలేదు. ఏమయ్యాడో తెలీకా కంగారుపడ్డారు.

రోజురోజుకూ అర్ధంలేకుండాపోతోంది జీవితానికని గొణుక్కునేవాడు ప్రకాశం.

'బంగారంలాంటి అవకాశాన్ని పోగొట్టారు. యీ వయసులో రిటైర్మెంట్ తీసుకుంటే మాకూ ఓ దారుండేది. ఆయనకూ రెష్టు దొరికేది. నేను చెప్పినప్పుడే ఆఫీసులో అప్లికేషను యిచ్చుంటే యీపాటికి నాకు ఉద్యోగం వచ్చేసుండేది. యింకిప్పుడు యింకో మార్గమే లేకుండాపోయింది' అని విసుక్కున్నాడు పెద్దాడు.

'ఆ వెంకట్‌గాడే అదృష్టవంతుడు. వాళ్ళ నాన్న మొన్న డ్యూటీలో ఉన్నప్పుడు జరిగిన రైలు ప్రమాదంలో పోయాడు. వెంటనే వాడికి ఉద్యోగం వచ్చింది' అని వాడు చెప్తుంటే కమలమ్మ కళ్ళనీళ్ళపర్యంతమయ్యింది.

ప్రకాశానికి బాధనిపించింది. జీవితమంటే పిల్లలూ, వాళ్ళ ఆనందం అనుకొంటూ గడిపినందుకు యిదేనా ఫలితం? తండ్రి మీద కించిత్ ప్రేమ గౌరవం కూడా మిగల్లేదు. వాళ్ళ బతుకు, వాళ్ళ సంతోషం ముందు తండ్రి ప్రాణానికి కూడా విలువ లేకుండా పోయింది అని వేదనపడ్డాడు ప్రకాశం.

ఆ రాత్రి కమలమ్మతో అదే విషయాన్ని పదేపదే ప్రస్తావించాడు.

'వాడేదో ఉద్యోగం లేదన్న బాధ, వయసు దాటిపోతే ఉద్యోగానికి అర్హత పోతుందన్న భయంతో ఏదో అనుంటాడు. పోటీ పరీక్షలకి తయారవ్వమని నేను చెప్తాను లెండి' అని ఓదార్చింది భర్తని.

ఆ రోజు ఆమె భుజం మీద చెయ్యి వేసి కూర్చున్న అతని మనసులోని భావాన్ని అర్ధంచేసుకోలేకపోయినందుకు ఆమె యిప్పటికీ తనని తను క్షమించుకోలేకపోయింది.

ఆ తెల్లవారి 'జాగ్రత్త నువ్వు. పిల్లలు జాగ్రత్త' అని చెప్తున్నప్పటి అతని కళ్ళలో కనిపించిన తొట్రుపాటు ఆమెకు యిప్పుడర్ధమౌతోంది.

ప్రకాశం టిటియి ఉద్యోగ నిర్వహణలో రైల్లోంచి ప్రమాదవశాత్తూ పడి మరణించాడు. నిర్ఘాంతపోయిన కమలమ్మ దు:ఖానికి అంతంలేదు. ఆమె నోటివెంట ఒక్క మాట కూడా రాలేదు.

కొడుకులు వచ్చారు. ఏడ్చారు. అన్ని పనులు సాగిపోతున్నాయి. పై ఆఫీసరుగారు వచ్చారు. కమలమ్మను పలకరించారు. యిద్దరబ్బాయిల్లో ఒకళ్ళతో దరఖాస్తు పెట్టస్తే తండ్రి తరఫు ఉద్యోగం వచ్చేలా చేస్తానని హామీ యిచ్చారు. ఆయన్ని ఏ ఆఫీసులో కలుసుకోవాలో అడ్రస్సు యిచ్చి వెళ్ళిపోయారు. ఆమె మౌనంగా తలూపింది.

భర్త మరణం, ఆ మరణానికి వెనకున్న కారణం ఆమెను తొలిచేస్తుంది. మానవత్వానికి, ప్రేమకు అర్ధం లేనంతగా యీ ప్రపంచం పరిగెత్తుతోందా అనిపిస్తోంది.

*** *** ***

ఆ రోజు వంటంతా అయ్యాక బీరువాలో పాత నగల పెట్టి తీసింది కమలమ్మ. దాని అడుగున చిరిగిపోతున్న కాయితం తీసి దులిపింది. చిన్నప్పుడు స్కూలు ఫైనలు అత్తెసరు మార్కులతో పాసయిన సర్టిఫికెట్ అది. జాగ్రత్తగా కవరులో పెట్టుకొని యింటికి తాళం వేసి బయటకు నడిచింది.

పిల్లలొస్తే తాళం యివ్వమని పక్కింట్లో యిచ్చింది. ఆ సాయంత్రం ఆమె యింటికి తిరిగొచ్చింది. ఎక్కడికి వెళ్ళావని పిల్లలు అడగలేదు. విజయవాడ పెద్దాఫీసుకు వెళ్ళినట్లు ఆమె చెప్పలేదు. వాళ్ళ మధ్య మాటలు చోటులేక గొంతుల్లోనే మూగబోతున్నాయి.

*** *** ***

నెల రోజులు తిరక్కుండానే యింటి అడ్రస్‌కి ఆర్డర్స్ వచ్చాయి. కమలమ్మను స్వీపరుగా అప్పాయింట్ చేస్తున్నట్టు. ఆ రోజు పెద్దాడి గొడవకు హద్దులేదు.

'యిదెలా యిస్తారు. నాకు ఉద్యోగం రావాలి. యీ దిక్కుమాలిన స్వీపరు ఉద్యోగానికి నువ్వు వెళ్ళొద్దు' అని గొడవ.

ఆమె ఏమీ సమాధానం చెప్పలేదు. కఠినత్వానికి అలవాటుపడలేక ఆమె ఉక్కిరిబిక్కిరి అయ్యింది. అయినా అలానే మౌనంగా ఉంది.

యిన్నాళ్ళూ ప్రేమ తప్ప యింకేమీ తెలీని కన్నతల్లి పేగు. అయినా వాళ్ళ ప్రవర్తనకు తనూ ఒక విధంగా కరణమేగా అని ఆలోచిస్తోంది కమలమ్మ. ప్రకాశానికి వచ్చిన గ్రాట్యూటీ, యిన్సూరెన్సులు మొత్తానికి మూడున్నర లక్షల వరకూ వచ్చాయి. అవి ముగ్గురిపేరా ఫిక్సిడు డిపాజిట్ చేసింది. తన జీతం, ఆ డిపాజిట్స్ మీద వచ్చే వడ్డీ కలిస్తే యిల్లు గడిచిపోతుంది.

'నాన్నగారి కోరిక ప్రకారం ఉద్యోగాల కోసం ఎవరి మీదా ఆధారపడకుండా మీ ప్రయత్నం మీరే చెయ్యండి. మీ కాళ్ళ మీదా, మీ శ్రమ మీదా బతకడం నేర్చు కోండి నాన్నా' అని ఒక్క మాట మాత్రం స్పష్టంగా వాళ్ళకు చెప్పగలిగింది కమలమ్మ

ఆమె మొదటి రోజు ఉద్యోగానికి బయల్దేరింది. నిన్నటి వరకూ ఏమీ పట్టని తమ తల్లి అలా మౌనంగా తన పని తాను చేసుకుపోవడం ఆ పిల్లలకు అర్థం కావడం లేదు.

'నాన్నగారి కోరిక ప్రకారం ఉద్యోగాల కోసం ఎవరి మీదా ఆధారపడకుండా మీ ప్రయత్నం మీరే చెయ్యండి. మీ కాళ్ళ మీదా, మీ శ్రమ మీదా బతకడం నేర్చుకోండి నాన్నా' అని ఒక్క మాట మాత్రం స్పష్టంగా వాళ్ళకు చెప్పగలిగింది కమలమ్మ.

వాళ్ళేం చేస్తారో కాలమే తీర్పు చెప్తుంది... ...

దూరంగా వెళ్తున్న రైల్లోంచి పచ్చజండా ఒకటి రెపరెపలాడుతూ కనిపిస్తోంది... ...

## పిల్లల పనిపట్టే పళ్ళరసాలు

పళ్ళరసాలు పిల్లలు మంచివా? కావా? అన్న చర్చ చేస్తే..అంత మంచివి కావన్నది ఓ రిపోర్ట్. 'ఆర్చీవ్స్ ఆఫ్ పీడియాట్రిక్ అండ్ అడాలిసెంట్ మెడిసిన్' రిపోర్ట్ ప్రకారం పళ్ళరసాల్లోని సొరొబిటాల్ లేదా ఎక్కువ మోతాదు ఫ్రక్టోజ్ తియ్యదనం పిల్లల్లో అస్థిమితాన్ని కలిగిస్తుందట. గ్యాస్ పె[illegible]గుతుంది. కడుపు నొప్పులవంటివి వస్తా[illegible]. పిల్లలు కార్బొహైడ్రేట్‌లను కరిగించుకు[illegible] విషయంలో చాలా కష్టపడాల్సి వస్తుంది. అలాగే షుగర్ కంటెంట్ విషయంలోనూ. అయినా



మొదటిసంవత్సరం నుంచే పిల్లలు పళ్ళరసాల పనిబడుతుంటారు.

ఫ్లోరిడాలోని మియామి చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ కన్రోడ్ ఆర్ రోలె 14 మంది ఆరోగ్యవంతులైన పిల్లలను తీసుకుని నాలుగు ఔన్సుల బేరిపళ్ళరసాన్ని కొందరికి, అంతేమోతాదులో తెల్లద్రాక్షరసాన్ని మిగిలినవారికి ఇచ్చాడు. వారి శారీరకసామర్థ్యాన్ని, వారిలో రెస్ట్‌లెస్‌నెస్‌ను గమనించాడు. ద్రాక్షరసం తాగినవారికన్నా బేరిపళ్ళరసం తాగిన పిల్లల్లో చిరాకు ఉండటం ఎక్కువగా కనిపించిదట. బేరిపళ్ళరసం (సొర్‌బిటాల్ అత్యధికంగా ఉంటుంది. షుగర్ మోతాదు కూడా ఫ్రక్టోజ్ రూపంలో చాలా ఎక్కువగానే ఉంటుంది) తాగిన ఏడుగురిలో ఐదుగురుపిల్లల్లో కార్బొహైడ్రేట్స్ వినియోగం పూర్తిస్థా యిలో జరగలేదట. శరీరంలో గ్యాస్ విడుదలవ్వటం, కడుపులో నొప్పి, డయేరియా వంటివి వచ్చాయి. కార్బొహైడ్రేట్‌లు సరిగ్గా కరగని మిగిలినవారిలో చిరాకుపాలు ఎక్కువగా కనిపించిదట. సార్బిటల్ లేని తెల్లద్రాక్ష రసం తాగిన ఏడుగురిలో ఇద్దరు పిల్లల్లో మాత్రమే పై చెప్పిన లక్షణాలు కనిపించాయట. తెల్లద్రాక్షరసంలో ఫ్రక్టోజు మోతాదు తక్కువగా ఉండటం కూడా మరో కారణం. పిల్లల్లోని ఈ నలతను తల్లిదండ్రులు ప్రత్యేకించి గమనించకపోవచ్చు. పిల్లల్లో చిరాకు ఎక్కువవడం వెనుక అసలు కారణం ఇదీ అని తెలియకపోవడం వల్లే పెద్దలు గమనించలేరంటారు డాక్టర్‌గారు. పసి పిల్లల విషయంలో పళ్ళరసాలు కాస్త తక్కువగా ఉపయోగించడమే మంచిదేమో మరి!